# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**చంపాపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ ఈఓ ఎన్.లావణ్య, వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వినాయకస్వామి, ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.నాగశ్రావ్య, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ధ్యానాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వర, స్ఫటికలింగేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఆలయంలో అన్నప్రసాదం అందజేత**

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో కేకేగార్డెన్ యజమాని కోయిలకొండ సుధాకర్ ఆధ్వర్యంలో భక్తులకు నాలుగు క్వింటాళ్ల పులిహోర ప్రసాదం, తాగునీటిని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.లావణ్య పాల్గొని భక్తులకు ప్రసాదంను అందజేశారు.

**హయత్‌నగర్, మన్సూరాబాద్‌లలో..**

**హయత్‌నగర్:** హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్‌లతో పాటు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఆలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. కల్వంచ శాంతినగర్‌లోని సోమేశ్వరాలయం, కంఠమహేశ్వర స్వామిఆలయం, అన్మగల్ హయత్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, తొర్రూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, ఆర్టీసీకాలనీలోని సాయిబాబా, శివాలయం, వీరన్నగుట్టలోని శివాలయం, ఇంజాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కొహెడా, బ్రాహ్మణపల్లిలోని వేణుగోపాలస్వామిఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, తొర్రూర్‌లోని గోదారంగనాథస్వామి ఆలయం, రేణుకా ఎల్లమ్మ, ఆంజనేయస్వామిఆలయం, తుర్కయంజాల్‌లోని భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి, మునగనూర్‌లోని మల్లికార్జునస్వామిఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** కార్తీక పౌర్ణమి వేడుకలను నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా అన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కుకుట్లపల్లి మహేందర్ పాల్గొన్నారు.

**చాదర్‌ఘాట్ :** మలక్‌పేట పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు దీపోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు ఝామున్నుంచే కార్తీక పౌర్ణమి దీపోత్సవాలు శాలివాహననగర్ కాలనీలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మొదలయ్యాయి. సలీంనగర్‌లోని షిరిడీ సాయి సంస్థాన్‌లో చండీ హోమంతో పాటు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ టి.రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**కొత్తపేట:** కొత్తపేట - నాగోల్ రహదారిలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెదపూర బ్రహ్మయ్య, చైతన్యల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఓల్డ్‌మలక్‌పేట :** ఓల్డ్‌మలక్‌పేట హనుమాన్ ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ బుగుడాల సుదర్శన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్


వనస్థలిపురంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శివుడికి అభిషేకం నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేష్


కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి, ఈఓ లావణ్య


కొత్తపేట - నాగోల్ రహదారిలో అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్‌కుమార్, బీసీ ఐక్య వేదిక నాయకులు


సలీంనగర్‌లోని షిరిడీసాయి సంస్థాన్‌లో చండీ హోమంలో కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు


శాంతినగర్‌లో భక్తులతో సందడిగా మారిన సోమేశ్వర ఆలయం

---

ట్రాఫిక్ నియంత్రణకు

## చౌరస్తాల వారీగా ప్రణాళికలు

● డి.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్బీనగర్

**కొత్తపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యాలకు చేరుకునే వీలుందని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు సూచించారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన రాచకొండ పరిధిలోని ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో వాహనాల రద్దీని నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న చర్యలను వివరించారు.

ఇంటర్వ్యూ...

**వాహనాల రద్దీ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

ఎల్బీనగర్ చౌరస్తాలో పని దినాల్లో పలు కార్యాలయాలకు, విద్యా సంస్థలకు వాహనాల్లో వెళ్లే వారితో ఉదయం 7.30 నుంచి 9.30గంటల మధ్య, సాయంత్రం 4 నుంచి 8.30, రాత్రి 9నుంచి 10.30గంటల మధ్య వాహనాల రాకపోకలు విపరీతంగా ఉంటాయి. బస్టాపులు లేకపోవడంతో ఉప్పల్‌వైపు, బీఎన్‌రెడ్డి, సంతోష్‌నగర్ వైపు బస్సులు ప్రధానదారిలో నిలపడం వల్ల వాహనాల రద్దీకి దారితీస్తుంది. ఫ్లై ఓవర్లకింద జీహెచ్ఎంసీ సుందరీకరణ పనులు పూర్తికాకపోవడం మరో కారణం.



**ట్రాఫిక్ నివారణకు మీరిచ్చే సూచనలు ?**

ఉప్పల్ వైపు వెళ్లే బస్సుల కోసం 200మీటర్ల దూరంలో స్టాపు ఏర్పాటు చేయాలి. బీఎన్‌రెడ్డి, సంతోష్‌నగర్ వెళ్లే బస్సుల కోసం అండర్‌పాస్ తర్వాత స్టాప్ ఉండాలి. ఇబ్రహీంపట్నం, మెహిదీపట్నం బస్సులు అండర్‌పాస్ గుండా వెళ్లాలి. హయత్‌నగర్ వైపు వెళ్లే బస్టాపు సితార హోటల్ దాటిన తర్వాత ఉండాలి. కమిషనర్ సహా ఉన్నత అధికారుల సలహాలతో సిబ్బందికి సూచనలు చేస్తూ వాహనాల రద్దీని నియంత్రిస్తున్నాం.

**కామినేని చౌరస్తా వద్ద వాహనాల నియంత్రణ ఎలా?**

అల్కాపురి నుంచి కామినేనిచౌరస్తా దారిలో కిలోమీటర్ వరకు మధ్యలో యూటర్న్ ఉంటే రద్దీ తగ్గే అవకాశముంది. మన్సూరాబాద్ వైపు రాకపోకలు సాగించే వాహనాలను, సీరీస్ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనాల రద్దీకి సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలను గుర్తిస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నాం. ఉప్పల్ వైపు ఫ్లై ఓవర్ పిల్లర్ నెం.10 -11 మధ్య యూటర్న్ కోసం ఉన్నతాధికారుల ద్వారా జీహెచ్ఎంసీని కోరనున్నాం.

**వైన్‌షాపుల వద్ద పార్కింగ్ సమస్యల నివారణకు మీ చర్యలు?**

వాహనాలను వైన్స్ వద్ద నిలుపుతున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయి. రోడ్లపై వాహనాలు నిలిపితే కఠినచర్యలు తప్పవు. వీటితో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజలు ఈ పరిస్థితిని గుర్తించాలి. ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పించరాదు. రద్దీ సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అక్రమంగా పార్కింగ్‌చేసిన వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నాం.

**ఆనంద్‌నగర్‌చౌరస్తా వద్ద వాహనాల నియంత్రణ ఎలా ?**

తట్టిఅన్నారంవైపు, నాగోల్‌వైపు, మన్సూరాబాద్‌వైపు వాహనాల రాకపోకల నియంత్రణను స్వయంగా పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలు ఇస్తున్నాం. వాహనాల రద్దీ నియంత్రణకు ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బంది చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నారు. వాహనాలు నడిపే వారు నిబంధనలు పాటించాలి. ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గించరాదు. ఆనంద్‌నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

---

## ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**ఎల్బీనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి 40వ సప్తాహ్నిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం గణపతి, సుబ్రహ్మణ్యస్వామి వార్లకు పంచామృతాభిషేకం, సుబ్రహ్మణ్య స్వామి హోమం, సర్పసూక్త హోమం. లఘుపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులచే సామూహికంగా శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయించారు. సాయంత్రం జ్వాలాతోరణం, ఉమామహేశ్వరస్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతిప్రసాద్, మాజీ చైర్మన్ గండు ధనంరెడ్డి, కమిటీ ప్రతినిధులు భోగేశ్వర్‌రావు, సుబ్బారావు, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్‌రావు, వీరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేయిస్తున్న అర్చక బృందం


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

---

మూసీ ప్రక్షాళనకు కాదు..

## రియల్ వ్యాపారాలకే వ్యతిరేకం

● నేడు మూసీ పరీవాహక ప్రాంతాల్లో బీజేపీ నాయకుల బస

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

**మన్సూరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టే మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న ఆలోచనకే వ్యతిరేకమని ఆపార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సామ రంగారెడ్డి మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు తాము ఇబ్బందులకు గురవుతున్నామని ఎప్పుడైనా దరఖాస్తు చేసుకున్నారా? అని ప్రశ్నించగా.. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ ఈటల రాజేందర్‌ను మూసీ పరీవాహక ప్రాంతాల్లో బసచేయాలని విసిరిన సవాలును పార్టీ స్వీకరిస్తుందన్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం మూసీ పరీవాహక ప్రాంతాల్లో 27చోట్ల బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు బస చేయనున్నారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డివి ఊకదంపుడు ఉపన్యాసాలని విమర్శించారు. పేదల ఇళ్లు కూలగొట్టి పెద్ద షాపింగ్‌లు కట్టడమే రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన అన్నారు. గతంలో మోదీ సబర్మతి నది ప్రక్షాళన కోసం దాదాపు 25వందల కిలోమీటర్లు 12నెలల్లో పూర్తి చేశారని గుర్తుచేశారు. 55 కిలోమీటర్ల మూసీకి ఇంతవరకు డీపీఆర్ ఖరారు చేయకుండానే ముందుగానే లక్షా యాభైవేల కోట్లతో పునరుద్ధరిస్తామనడం అవివేకానికి నిదర్శనం అన్నారు. ఎంపీ ఈటల శనివారం సాయంత్రం 4గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు ఫణిగిరి కాలనీలోని మూసీ పరీవాహక ప్రాంతాల కాలనీవాసులతో బస చేస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, సునీతారెడ్డి, ఆలే పురందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

---

## డిప్యూటీ సీఎంను కలిసిన మార్కెట్ వైస్ చైర్మన్

**సైదాబాద్ :** హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ హనుమంతరావులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సూచించినట్లు శ్రీనివాస్ వివరించారు.


భట్టిని కలిసిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

---

## ట్రంక్‌లైన్ పనుల్లో రైతులకు నష్టం కలగకుండా చర్యలు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం :** బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు 21కాలనీల ట్రంక్‌లైన్ పనుల కోసం రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీల నుంచి మునగనూర్ నుంచి వెళ్లే ట్రంక్‌లైన్ పనులు నిలిచిపోయిన నేపథ్యంలో ట్రంక్‌లైన్ పైప్‌లైన్ పనులకు కావాల్సిన భూమిని మానవతాదృక్పథంతో ఇవ్వాలని ఇటీవల సదరు రైతులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సదరు రైతులతో, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమ భూమికి తగిన నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి తగిన నష్టం చెల్లించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ జోన్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌యాదవ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్యాంసన్, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, రైతులు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


అధికారులు, రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

---

## అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం, గోధుమలు సీజ్

**ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** అక్రమంగా నిల్వచేసిన రేషన్‌బియ్యం, గోధుమలను సివిల్ సప్లై అధికారులు సీజ్ చేశారు. నిల్వచేసిన వారిలో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరొకరు పరారీలో ఉన్నాడు. మలక్‌పేట ఏఎస్ఓ నర్సింగ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ వాహెద్‌నగర్‌లో ఒక ఇంట్లో అక్రమంగా రేషన్‌బియ్యం, గోధుమలు ఉన్నాయన్న పక్కా సమాచారం రావడంతో గురువారం రాత్రి సివిల్ సప్లై అధికారులు, సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి 65క్వింటాళ్ల రేషన్ బియ్యం, గోధుమలను స్వాధీనం చేసుకొని సీజ్‌చేశారు. ఇంటి యజమాని జాఫర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.


పట్టుబడ్డ రేషన్ బియ్యం, గోధుమలు

---

## ఆర్‌ఎన్‌ఆర్ కాలనీలో వినోబా భావే వర్ధంతి

**అబ్దుల్లాపూర్‌మెట్ :** భూదాన్ బోర్డు వ్యవస్థాపకుడు ఆచార్య వినోబా భావే 42వ వర్ధంతి కార్యక్రమాన్ని కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3లోని పాపయిగూడలో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వినోబా భావే చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్రసమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సైదులు, నర్సింహ, నిరంజన్, యాదగిరి, దేవమ్మ, క్రాంతి పాల్గొన్నారు.

---



## భార్యపై అలిగి భర్త అదృశ్యం

**హయత్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** దంపతులిద్దరు గొడవ పడ్డారు. భార్య భర్తపై అలిగి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. భర్త భార్యపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ బ్లడ్ బ్యాంక్‌కాలనీలో నివాసం ఉండే కొమ్ము నరేష్(39)కి 2011లో దీప్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తరుచూ ఇద్దరు గొడవ పడుతుండే వారు. గత గురువారం భార్య, భర్తలు గొడవపడ్డారు. దీంతో భార్య దీప్తి భర్తపై అలిగి తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో కూడా నరేష్ భార్యపై అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. నరేష్ ఇంట్లో లేడని తెలుసుకున్న దీప్తి చుట్టు పక్కల, తెలిసిన బంధువుల వద్ద విచారించింది. అయినా నరేష్ ఆచూకీ లభించలేదు. గొడవ పడినప్పుడల్లా నరేష్ ఇంట్లో నుంచి వెళ్లి రెండు మూడు రోజుల తర్వాత తిరిగి ఇంటికి చేరుకుంటాడు. అదే మాదిరిగా వస్తాడని దీప్తి ఎదురు చూసింది. శుక్రవారం నాటికి కూడా ఇంటికి రాకపోవడంతో ఉదయం తన భర్త నరేష్ కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


నరేష్

## సీసీ కెమెరాలు ప్రారంభం

**వనస్థలిపురం , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్‌కాలనీ ఫేజ్-2లో రూ.4.50 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కాలనీవాసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం అన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ప్రతి కాలనీవాసులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ రూ.50వేల సొంత నిధులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం, మీర్‌పేట్ సీఐలు శ్రీనివాస్, నాగరాజు, కాలనీ అధ్యక్షుడు కొట్ర శివ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాండురంగారెడ్డి, రామారావు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కాశీరెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి